సాక్షి అనకాపల్లి

గురువారం । 25 । జనవరి । 2024



పట్టణాలకు దీటుగా పల్లెలు

దేవరాపల్లి మండలంలో రూ.1.73 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు. 10లో



హుండీ లెక్కింపు

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో గత 25 రోజుల వ్యవధిలో హుండీల ద్వారా రూ.54.06 లక్షల ఆదాయం లభించింది.



వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌పై అవగాహన అవసరం

తుమ్మపాల: ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌పై అందరూ అవగాహన కలిగిఉండాలని, ఓటర్లకు యాప్‌పై అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, బూత్ గుర్తించడం కోసం ఈ యాప్ రూపొందించినట్లు చెప్పారు. electoralsearch.eci.gov.in/ వెబ్‌సైట్ ద్వారా తమ ఓటును గుర్తించవచ్చన్నారు. ఓటరు సేవ పోర్టల్‌లో పేరు, గుర్తింపు కార్డు, ఎపిక్ నంబరు, రిజిస్టర్ మొబైల్ నంబరుతో తమ ఓటు ఏ పోలింగ్ బూత్ పరిధిలో ఉందో గుర్తించవచ్చన్నారు. జాబితాలో తమ పేరు లేనట్టయితే ఫారం-6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఈవీఎం సంచార వాహనం పర్యటిస్తుందని ఆయన చెప్పారు. దానిద్వారా ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, ఎస్ఏ తులసిరామ్ పాల్గొన్నారు.

దేశం గర్వించేలా మోదీ పాలన

కేంద్ర మంత్రి మురళీధరన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురళీధరన్

అనకాపల్లి: భారతదేశం గర్వించేలా ప్రధాని మోదీ పాలన సాగుతోందని కేంద్ర మంత్రి మురళీధరన్ అన్నారు. స్థానిక విజయా రెసిడెన్సీలో బుధవారం ఆయన శక్తి కేంద్రాల ప్రముఖులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో మళ్లీ రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో ఓటరులో చైతన్యం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కాశీరాజు, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు పాల్గొన్నారు.

డీఎఫ్‌వోగా జగన్నాథ్‌సింగ్ బాధ్యతల స్వీకారం



నర్సీపట్నం: జిల్లా అటవీ శాఖ అధికారిగా (డీఎఫ్‌వో) ఆర్.జగన్నాథ్‌సింగ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ సబ్ డివిజన్ పరిధిలో రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. క్వారీలను స్వయంగా పరిశీలించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తానన్నారు. రంగురాళ్ల తవ్వకాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, అటవీ వనాలను పరిరక్షిస్తానన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని, డివిజన్‌లో అడవుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానని చెప్పారు. రేంజర్లు, అటవీ శాఖ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఆర్జేడీ జ్యోతికుమారి



సీతయ్యపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

బుచ్చెయ్యపేట: విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని ఆర్జేడీ జ్యోతికుమారి తెలిపారు. బుధవారం ఆమె సీతయ్యపేట హైస్కూల్‌ను, బుచ్చెయ్యపేట ఎంఈవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీతయ్యపేట హై స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులున్నారు, ఎంత మందికి ట్యాబ్‌లు, విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారో తెలుసుకున్నారు. ఎండీఎం రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పని చేస్తోందని చెప్పారు. హెయిర్ స్టైల్ మార్చుకోవాలని,మంచి పరివర్తన అలవర్చుకోవాలని పలువురు విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. బుచ్చెయ్యపేట ఎంఈవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

అంగరంగ వైభవం.. ఆది దంపతుల కల్యాణం



సారెను ఊరేగిస్తున్న మహిళా భక్తులు

పట్టు వస్త్రాలు, నుదుటున కల్యాణ తిలకం... బాసికం..పాదాలకు పారాణితో అమ్మను.. బుగ్గన చుక్క...మెడలో అందమైన సుగంధ పుష్ప మాలలు... నిండైన రూపంతో శివయ్యను పెళ్లికూతురు,పెళ్లికుమారుడుగా అలంకరించి వేదికపై అధిష్టింపజేసిన వేళ ఆ ఆది దంపతులను కనులారా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. అలౌకికానందంలో తన్మయులయ్యారు. మళ్లీమళ్లీ ప్రణామాలు ఆచరిస్తూ, స్మరిస్తూ... భక్తిప్రవత్తులతో గౌరీ పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

అనకాపల్లి: గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో బుధవారం అమ్మవారి కల్యాణం కమనీయంగా జరిగాయి. ఈనెల 27న జరిగే అమ్మవారి ఉత్సవంలో భాగంగా కల్యాణంతోపాటు సారె ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, సింధుజ దంపతులతో అర్చకులు నేతేటి సుబ్రహ్మణ్యశర్మ కల్యాణం జరిపించారు. కల్యాణవేడుకలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



కల్యాణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలు

సాయంత్రం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు కన్నులపండువగా సాగింది. ఊరేగింపులో తీన్మార్ వాయిద్యాలు, బ్యాండ్, సన్నాయిమేళం, తోడపెద్దుసేవ, డీజే సౌండ్‌లో వేలాదిమంది మహిళా భక్తులు పాల్గొన్నారు. బూరెలు, అరిసెలు, గవ్వలు, సున్నిపాకుండలు, పూతరేకులు, జంతికలు, మురుకులు, పాలముంజెలు వంటి తినుబండారాలతోపాటు పసుపు, కుంకుమలు, విభూదిలింగం, చీరలు, కూరగాయలు, వాహనం, ఫర్నిచర్ ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపును సీఐ శంకరరావును ప్రా రంభించారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

మహోన్నత మహిళా శక్తి



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన ఈమె పేరు కండెల్లి మాణిక్యం. ఒంటరి మహిళ. వ్యవసాయ కూలి పనులు చేసుకొని జీవించేది. తన గ్రామంలో కూరగాయలు, బెల్లం వంటి సరకులు, వ్యవసాయ వస్తువులను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించిందామె. లోడ్ ఆటో డ్రైవింగ్ నేర్చుకుంది. ఉన్నతి మహిళా శక్తి పథకానికి దరఖాస్తు చేసి తన వాటా 10 శాతం రూ.30 వేలు చెల్లిస్తే లోడ్ ఆటో ఇచ్చారు. మార్కెట్‌లో రూ.3.30 లక్షలున్న ఆటోను ప్రభుత్వం రూ.2.70 లక్షలకే అందించింది. వడ్డీ లేకుండా నెలవారీ వాయిదా రూ.6 వేలు చెల్లిస్తోంది. పురుషులతో సమానంగా ఆదాయం పొందుతున్నానని ఆనందం వ్యక్తం చేస్తోంది.

- స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు సువర్ణావకాశం
- 'ఉన్నతి.. మహిళా శక్తి' పథకం ద్వారా ఆటోలు మంజూరు
- వడ్డీ లేని రుణంతో చేయూతనందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



మహిళలకు పంపిణీ చేసిన ఆటోలు

తుమ్మపాల: నిరుపేద కుటుంబాలు వారివి.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడినవారు.. కూలీనాలీ చేసుకొని బతుకుతున్నవారు.. ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.. జీవన ప్రమాణాలు పెరిగాయి.. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం అమలు చేస్తున్న పథకం వారి జీవితాలను ఎంతో మెరుగుపరచింది. ఇటీవల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'ఉన్నతి మహిళా శక్తి' పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన మహిళలకు ఉపాధి లభిస్తోంది. ఈ పథకంలో ఆటోలను పంపిణీ చేయడంతో పలువురు మహిళలు ప్రస్తుతం జిల్లాలో ఆటోలు నడుపుతూ రయ్ రయ్ మంటూ తమ బతుకు బండిని సాఫీగా సాగిస్తున్నారు.

రూ.24.60 లక్షల వడ్డీ లేని రుణాలు

డీఆర్డీఏ ఆధ్వర్యంలో 'ఉన్నతి -మహిళా శక్తి' పథకంలో లబ్ధిదారులు ఆటో రిక్షా ఖరీదులో 10 శాతం చెల్లిస్తే.. ప్రభుత్వం మిగిలిన 90 శాతానికి వడ్డీ లేని రుణం మంజూరు చేస్తోంది. జిల్లాలో 9 మండలాల్లో 9 మంది మహిళా సభ్యులకు మొదటి విడతగా రూ.24,60,524లను రుణంగా ఇచ్చారు. ఒక్కొక్కరికి రూ.3,03,434ల విలువైన ఆటోను ఇవ్వడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల రూ.6 వేల వంతున సులువైన వాయిదాలు చెల్లిస్తూ బాకీ తీర్చుకుంటున్నారు. జిల్లాలో మాడుగుల, పాయకరావుపేట, కోటవురట్ల, సబ్బవరం, మునగపాక, అచ్యుతాపురం, బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం మండలాల మహిళలు ఇప్పటికే ముందుకు వచ్చి ఆటోలు పొందారు.

పథకానికి అర్హతలివీ..

ఈ పథకం కింద లబ్ధి పొందడానికి 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. లబ్ధిదారులు కోరుకున్న మోడల్ ఆటో ఖరీదులో 10 శాతం వాటాను ముందుగా వారి డ్వాక్రా పొదుపు ఖాతాలో జమ చేయాలి. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యత్వం ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు మాత్రమే అర్హులు. ఆటో నడుపుకోవడం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ పథకం దోహదం చేస్తోంది. మహిళా శక్తి ఆటో రిక్షా పథకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళల నుంచి సెర్ప్ ఉన్నతి విభాగానికి దరఖాస్తు చేసుకోవాలి. లబ్ధిదారులే తమకు కావాల్సిన ఆటో రిక్షా మోడల్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. పాసింజర్ ఆటో, ట్రాలీ ఆటో, డీజిల్, గ్యాస్ ఆటో.. ఏ మోడల్, ఏ కంపెనీ ఆటో కావాలో ఎంపిక చేసుకుంటే వాటినే మంజూరు చేస్తున్నారు. గ్రామ సంఘం ద్వారా వడ్డీ లేని అప్పును 45 నిర్ణీత వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఆటో రిక్షా కంపెనీ వారు ఇచ్చే లబ్ధిదారులకు శిక్షణ ఇస్తారు. మైనర్ రిపేర్లు ఏ విధంగా చేయాలో వారికి వివరిస్తారు. సమాజంలో అన్నింటా పురుషులతో పోటీ పడుతున్న మహిళలకు ఈ పథకం గొప్ప అవకాశమని డీఆర్డీఏ పీడీ శచీదేవి చెప్పారు. మహిళా మార్ట్‌ల ద్వారా సరకుల తరలింపునకు ఈ ఆటోలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.

భర్తకు చేదోడు వాదోడుగా...



నా భర్త ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. నా భర్త జీతంతో కుటుంబాన్ని నెట్టుకురాలేక చాలా అవస్థలు పడుతున్నాము. మా బావ గారికి ఆటో ఉంది. ఆటో ద్వారా ఖాళీ సమయాల్లో సర్వీస్ చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. దీంతో నేను కూడా నా భర్తకు తోడుగా కుటుంబానికి ఆర్థిక భరోసా ఇద్దామనుకున్నాను. నేను ఎస్‌హెచ్‌జీ గ్రూపులో సభ్యురాలిగా.. సబ్బవరంలో ఉన్న జగనన్న మహిళా మార్ట్‌లో సభ్యత్వం కలిగి ఉన్నాను. మార్ట్‌లో సరకులను గ్రామాల్లో అందించాల్సి ఉంటుంది. నా దరఖాస్తును ఆమోదించి ఆటో మంజూరు చేశారు. మార్ట్ ద్వారా సరకు రవాణాతో పాటు గ్రామాలకు రాకపోకలు చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాను.

–బండ రాజేశ్వరి, సబ్బవరం

క్రీడాభివృద్ధికి పటిష్ట చర్యలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాడుగుల జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం.. ఆంధ్రా' పోటీలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

తుమ్మపాల: క్రీడల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. తన చాంబర్లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న 'ఆడుదాం.. ఆంధ్రా' కార్యక్రమం క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. యువతలోనున్న ప్రతిభను గుర్తించి వారికి ఆసక్తి ఉన్న ఆటలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఆయా ఆటల్లో మెలకువలు నేర్పి, నిబంధనల పట్ల క్షుణ్ణమైన అవగాహన కలిగించాలన్నారు. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతున్నందున నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించడం మరింత సులభం అవుతుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి మంజులవాణి, ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్, డీపీవో శిరీషరాణి, డీఎస్‌డీవో ఎల్.వి.రమణ, పీఆర్ ఏఈ వీరునాయుడు, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఈవో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



మాడుగులలో రైతులకు అతుకబడి పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

మాడుగుల: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బుధవారం అతుకబడి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు సాగులో ఉన్నా పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలను రైతులు పొందలేకపోతున్నారని చెప్పారు. నగదు అవసరమైనపుడు భూముల క్రయవిక్రయాలు జరుపుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సన్న, చిన్నకారు రైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అతుకుబడి పట్టాలు అందజేసి ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.వి.రత్నం మాట్లాడుతూ మండలంలోని వీజేపురం, మాడుగుల, శంకరం, తాటిపర్తి దితర గ్రామాలకు చెందిన 96 మంది రైతులకు 87.50 ఎకరాలకు అతుకబడి పట్టాలు అందజేసినట్టు చెప్పారు. మండలంలో 500 మంది రైతులకు చెందిన 724 ఎకరాల డీఫారం భూములను మాగాణి భూములుగా మార్పు చేసినట్టు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 166 మంది ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోగా అందరికీ మంజూరు చేశామని, ఇప్పటికే 20 మందికి పట్టాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, మాడుగుల , తాటిపర్తి, శంకరం, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, అల్లంగి గౌరీదేవి,శోలం రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఆసరాగా..



వైఎస్సార్ ఆసరా పథకం ఎన్నో కుటుంబాల్లో దీపాలు వెలిగిస్తోంది. సంక్షేమ కాంతులను ప్రతిఫలింపచేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని అక్క చెల్లెమ్మలకు వరుసగా నాలుగో ఏడాది 'ఆసరా' నిధులు జమ చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బుధవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు లబ్ధిదారులకు రూ.12.33 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఆనందాన్ని ఇలా పంచుకున్నారు.. –యలమంచిలి

ఆసరాతో చిరు వ్యాపారం



రోజు కూలీగా పనులు చేసుకునేదానిని. వైఎస్సార్ ఆసరా స్త్రీనిధి ద్వారా రూ.1.50 లక్షల వరకు రుణాలు పొంది ఇంటి దగ్గర స్వయంగా హోమ్‌ఫుడ్స్ తయారీ వ్యాపారాన్ని ప్రారంభించి ఉపాధి పొందుతున్నాను. గృహావసరాలకు ఆర్థికంగా తోడ్పడింది. ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. జగనన్నకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

–యలమంచిలి వెంకటలక్ష్మి, గుంద్రుబిల్లి గ్రామం

జగనన్న భరోసా అండగా నిలిచింది...



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో మా రుణాలను తీర్చారు. నా భర్తకు పాము కరిచి అనారోగ్యం పాలైతే కుటుంబంలో ఎవరూ పట్టించుకోకపోయినా జగనన్న ఇచ్చిన ఆసరా పథకం నన్ను ఆదుకుంది. డ్వాక్రా రుణాల ద్వారా మరికొంత డబ్బులు రావడంతో స్వయంగా ఉపాధి పొంది పిల్లలను చదివించుకుంటున్నాను.

–మల్లపురెడ్డి లక్ష్మి, పులపర్తి గ్రామం

క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీపీగా రాజారామ్

- జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు



మాడుగుల ఎంపీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్ : మాడుగుల మండల పరిషత్ ఇన్‌చార్జి మండల పరిషత్ అధ్యక్షునిగా, ప్రస్తుత వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం మధ్యాహ్నం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ ఈ నెల 22న తన పదవికి రాజీనామా చేయడంతో, వైస్ ఎంపీపీ రాజారామ్‌ను ఇన్‌ఛార్జి ఎంపీపీగా నియమించారన్నారు. అలాగే వేమవరపు రామధర్మజను మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా నియమిస్తున్నట్టు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు



కలిగొట్లలో బందారుపాలెం తారురోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కలిగొట్లలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ వద్ద కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రెండు గ్రామాల్లో రూ. 1.73 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

దేవరాపల్లి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పట్టణాలకు దీటుగా అన్ని మౌలిక సదుపాయాలతో గ్రామీణ పల్లెలు అభివృద్ధి చెందాయని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. కలిగొట్ల, మారేపల్లిలో రూ. 1.73 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన డిప్యూటీ సీఎంకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మారేపల్లిలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, కలిగొట్లలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ. 20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, దిబ్బగరువు నుంచి కొటకల సత్యం కల్లం వరకు రూ. 27.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కలిగొట్ల, అర్జునగిరి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బందారుపాలెం వరకు రూ. 87 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న రహదారి సమస్యలను పరిష్కరించడం పట్ల ఆయా గ్రామస్తులు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనను ఘనంగా సత్కరించారు. మారేపల్లిలో రైతు భరోసా కేంద్రానికి అనుబంధంగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువుల వైద్య పరీక్షల దొడ్డిని డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల వైద్యం కోసం సుదూరంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌బీకేల్లోనే అన్ని వైద్య సేవలు అందిస్తారన్నారు. పాడి పశువుల కొనుగోలుకు రుణాలు, గడ్డి విత్తనాలు, గడ్డి కోసే యంత్రాలు సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారానే సరఫరా చేస్తారని తెలిపారు. కలిగొట్ల విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా మంజూరైన కంటి అద్దాలను లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, మారేపల్లి సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి, కలిగొట్ల సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి, ఎంపీటీసీ రుత్తల లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతు రామారావు, మాజీ ఎంపీటీసీ కొండబాబు, ఉప సర్పంచ్ కన్నంనాయుడు, పార్థసారధి, కోటి పల్లినాయుడు, ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని పాల్గొన్నారు.

సత్యదేవుని తీర్థానికి పోటెత్తిన భక్తజనం

- భక్తులతో కిక్కిరిసిన ఆలయ మెట్ల మార్గం



ప్రత్యేక అలంకరణలో విజయ వెంకట సత్యనారాయణ స్వామి.

దేవరాపల్లి : పెదనందిపల్లి శ్రీ విజయ వెంకట సత్యన్నారాయణ స్వామి తీర్థ మహోత్సవానికి వేలాదిగా భక్తజనం పోటెత్తారు. అన్నవరం సత్యనారాయణ మూర్తి స్వామి ఆలయం తర్వాత అంతటి విశిష్టత కలిగిన సత్యదేవుని తీర్థ మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ తీర్థ మహోత్సవాన్ని పెందనందిపల్లి, చిన నందిపల్లి, చేనులపాలెం, తారువా, తిమిరాం, మారేపల్లి, ఎం. అలమండ తదితర గ్రామాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తొలిరోజు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్త జనం తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మెట్ల మార్గంతో పాటు ఆలయానికి వచ్చే రహదారులన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా ఎస్‌ఐ డి.నాగేంద్ర పోలీస్ బందోబస్తును నిర్వహించి ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్‌లను ఏర్పాటు చేశారు. రాత్రికి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అతి తక్కువ ధరకే ఫైబర్‌నెట్ సేవలు

- ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

అనకాపల్లి : మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ ఆర్.వి. సతీష్‌రెడ్డి అన్నారు. స్థానిక కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘ కార్యాలయంలో బుధవారం సంఘ జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎస్.ప్రకాష్ అధ్యక్షతన కేబుల్ ఆపరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాంత్రిక జీవితంలో అన్నివర్గాలకు ఇంటర్నెట్ సౌకర్యం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అతితక్కువ ధరకు ఇంటర్నెట్, టీవీచానల్స్, ల్యాండ్‌ఫోన్ ట్రిపుల్‌ప్లే సేవలు విస్తృతం చేసిందన్నారు. రాబోయేరోజుల్లో పలు చానల్స్, సినిమాలతోపాటు వినోదాన్ని పంచే యాప్స్‌కు ఇంటర్నెట్ సేవలను విస్తృత పరుస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా ఓఎల్టీలు ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు సైతం ట్రిపుల్‌ప్లే సేవలు అందించే బాధ్యత ప్రతి కేబుల్ ఆపరేటర్‌పై ఉందన్నారు. ప్రైవేటు ఇంటర్నెట్ సంస్థలు రూ.4వేల ఆరు నెలల ప్యాకేజీ అందిస్తే, ఫైబర్‌నెట్ కేవలం రూ.2900లకే ఏడునెలల ప్యాకేజీ అందిస్తుందన్నారు. ఫైబర్‌నెట్ ద్వారా రూ.190, రూ.250కే నెలకు నూతన ప్యాకేజీలు అందుబాటులోకి రానున్నాయని, ఆపరేటర్లందరూ పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నెట్‌వర్క్ మేనేజర్ వేణుప్రసాద్, పట్టణంలో పలు ప్రాంతాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బెల్లం తయారీ క్రషర్లలో తనిఖీలు

- శాంపిళ్ల సేకరణ
- ప్రమాదకర రసాయనాలుంటే కఠిన చర్యలు
- జిల్లా ఆహార భద్రత అధికారి రవికుమార్



పిల్లవానిపాలెం క్రషర్‌లో తయారైన బెల్లం అచ్చును శాంపిల్‌గా తీసుకుంటున్న రవికుమార్

రావికమతం : చెరకు రసంలో పంచదారతో పాటు ప్రమాదకర రసాయనాలు కలిపి బెల్ల తయారు చేస్తున్న పలు క్రషర్‌లను జిల్లా ఆహార భద్రత అధికారి రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని దొండపూడి, టి.అర్జాపురం, పిల్లవానిపాలెం, గొల్లలపాలెం, రాజాం, కొండెంపూడిలో బెల్లం తయారీ చేస్తున్న క్రషర్లను తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. రసంలో బెల్లంతో పాటు ఏఏ రకాల రసాయనాలు కలుపుతున్నారని ప్రశ్నించారు. వారు సమాధానాలు చెప్పకపోవడంతో కొన్ని బెల్లం అచ్చులను స్వాధీనం చేసుకుని వాటిని శాంపిల్స్‌గా హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. కొందరు వ్యాపారుల సలహాలు పాటించి రైతులు చెరకు రసంలో పంచదార కలిపి దానిని బెల్లంగా మళ్లీ తయారు చేసి అమ్ముతున్నారని, ఈ ప్రక్రియలో ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని అందుకే బెల్లం క్రషర్‌లను తనిఖీ చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. శాంపిల్స్‌లో ఏవిధమైన ప్రమాదకర రసాయనం ఉన్నట్టు నిర్ధారణకు వచ్చినా క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులకు త్వరలోనే అవగాహన సదస్సు

బెల్లం తయారీ రైతులతో త్వరలోనే అనకాపల్లిలో ఒక అవగాహన సదస్సు నిర్వహిస్తామని రసాయనాలు లేకుండా బెల్లం తయారీ ఏవిధంగా చేయాలి, రసాయనాలు కలపడం వల్ల ప్రజలకు ఎలాంటి అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయో వివరిస్తామని ఆయన తెలిపారు.

విద్యార్థులకు 'సంస్కార్' శిక్షణ కార్యక్రమం

- డెక్కన్ ఫైన్ కెమికల్స్ వితరణతో స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కె.వి.ఎల్.పి రాజు

పాయకరావుపేట : డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రామరాజు ఫౌండేషన్ సంయుక్తంగా రూ.6 లక్షలు వ్యయంతో నిర్వహిస్తున్న సంస్కార్ అనే కార్యక్రమాన్ని డెక్కన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎల్.పి రాజు బుధవారం ఎస్.నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజానగరం, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు 35 రోజుల పాటు రోజుకు 2 గంటల పాటు సుశిక్షులతో భారతదేశ సంస్కృతి, నాగరికత, సంప్రదాయాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం పాయకరావుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సుమారు 800 మంది ఎస్ఎస్‌సి విద్యార్థులకు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ముద్రించిన, డెక్కన్ ఫైన్ కెమికల్స్ యాజమాన్యం సమకూర్చిన రూ.1.60 లక్షల విలువైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డెక్కన్ ప్రతినిధులు పి.వి.ఎస్.ఎస్ రాజు, ఎస్.సూర్యానారాయణ రాజు, బి.వెంకటపతిరాజు, రామరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సిపి రామరాజు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.ఝాన్సీ, కోడి శ్రీనివాసరావు, షేక్ రాం రహీం, రామరాజు ఫౌండేషన్ ప్రతినిధులు అప్పలనాయుడు, ధనుంజయ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

సాక్షి, అనకాపల్లి: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ.. రేంజ్ ఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలు, విశాఖ సిటీలో ముగ్గురు, విజయనగరంలో ముగ్గురు, శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి లభించింది. వీరితో పాటుగా సీఐడీలో నాలుగు, ఇంటలిజెన్స్ విభాగంలో ఏడుగురు, ఏపీ ట్రాన్స్‌కోలో ఒకరు, రైల్వేలో ఇద్దరు, మెరైన్‌లో ఒకరు, ఏసీబీలో పనిచేస్తున్న ఓ ఎస్‌ఐకి సీఐలుగా పదోన్నతి దక్కింది.

హోంగార్డుల కుటుంబాలకు అండగా పోలీస్‌శాఖ



మృతుని భార్య షర్మిలదీపికకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: హోంగార్డుల కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన బి.సురేష్ భార్య షర్మిలదీపికకు తన కార్యాలయంలో బుధవారం రూ.41,560 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల ఒకరోజు జీతాన్ని పోలీసుశాఖలో పని చేసి, మృతి చెందిన వారి కుటుంబాలకు కేటాయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వి.వి.విజయభాస్కర్, పరిపాలన అధికారి బి.శారద, జూనియర్ అసిస్టెంట్ ఎం.వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.8.34 కోట్లు మంజూరు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణానికి రూ.8 కోట్ల 34 లక్షలు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బుధవారం తెలిపారు. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న గ్రామాలను అనుసంధానం చేసే రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. తిమ్మన్నపాలెం నుంచి వయా బెన్నవోలు, బుచ్చెయ్యపేట రోడ్డుకు రూ.కోటి 12 లక్షలు, చలిసింగం-సీకేపాడు రోడ్డుకు రూ.కోటి 95 లక్షలు, సీతయ్యపేట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తోటకూరపాలెం వరకు రూ.కోటి 12 లక్షలు, రాజాం నుంచి మల్లాం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు రూ.కోటి 56 లక్షలు, రాజాం, తట్టబంద రోడ్డు నుంచి రాజుపాలెం వరకు రూ.కోటి, రావికమతం-కింతలి ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.కోటి 56 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు వీటికి ఈనెల 27వ తేదీన టెండర్లు పిలుస్తామని ధర్మశ్రీ చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

రాష్ట్రానికే స్టీల్‌ప్లాంట్ తలమానికం

కూర్మన్నపాలెం: ఆంధ్ర రాష్ట్రానికే విశాఖ స్టీల్‌ప్లాంట్ తలమానికమని, అటువంటి సంస్థను అమ్మేయాలనుకోవడం దురదృష్టకరమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు నేటి వరకు న్యాయం జరగలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రధానిగా రాహుల్‌గాంధీ రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ మీద సంతకం చేస్తారని, స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామనే అంశాన్ని చేర్చుతామని తెలిపారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు సంస్థలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు.

స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా గోపాలకృష్ణ గణేష్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ గోపాలకృష్ణ గణేష్ ఎంపికయ్యారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహించిన వి.వి.వేణుగోపాలరావు గత ఏడాది పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బుధవారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ)ఆధ్వర్యంలో ఈ పోస్టుకు ఇంటర్వ్యూలు జరిగాయి. స్టీల్‌ప్లాంట్ నుంచి గోపాలకృష్ణ గణేష్, బి.సూర్యారావు, హేమంత్ కుమార్ ఝా, చక్క మనోజ్ కుమార్, ఈ.కిరణ్‌లు హాజరయ్యారు. ఇందులో గోపాలకృష్ణ గణేష్‌ను ఎంపిక చేసినట్టు పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సమ్మె వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈనెల 29, 30 తేదీల్లో తలపెట్టిన కార్మిక సమ్మె వాయిదా పడింది. సెయిల్‌లో వేతన ఒప్పందం ప్రక్రియ పూర్తి కాకపోవడంపై కార్మిక సంఘాలు కేంద్ర కార్మిక శాఖకు ఫిర్యాదు చేశారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

- జిల్లా ప్రజా రవాణాధికారి పద్మావతి



డ్రైవర్లను పుష్పగుచ్ఛాలతో అభినందిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి పద్మావతి

నర్సీపట్నం : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని జిల్లా ప్రజారవాణాధికారిణి కె.పద్మావతి డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను ఆమె సందర్శించారు. గ్యారేజీ సిబ్బందితో సమావేశమై డ్రైవర్లు ఒత్తిడికి గురి కాకుండా బస్సుల కండిషన్ మెరుగ్గా ఉండాలని సూచించారు. డ్రైవర్లు విధి నిర్వహణలో ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న డ్రైవర్లకు పద్మావతి, డిపో మేనేజర్ ధీరజ్ పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఉత్తమ డ్రైవర్లకు అభినందన

అనకాపల్లి : జీరో రోడ్డు ప్రమాదాలే లక్ష్యంగా డ్రైవర్లందరూ విధులు నిర్వహించాలని జిల్లా ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి పిలుపునిచ్చారు. స్థానిక డిపో ఆవరణలో రహదారి భద్రతామాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రపంచ డ్రైవర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆమె ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చుతున్న డ్రైవర్లను అభినందించారు. గ్యారేజ్‌లో ఉత్తమసేవలందించిన మెకానిక్‌లు ఆర్.వి.రమణ, కె.వై.నాయుడు, ఎస్.చైతన్యలకు బహుమతులందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, డ్రైవర్లకు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్క రాష్ట్రం వారే బాబు స్టార్ క్యాంపెయినర్లు

- సీఎం వైఎస్ జగన్ దళితుల పక్షపాతి
- 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటే నిదర్శనం
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

డాబాగార్డెన్స్: టీడీపీ అధినేత చంద్రబాబుకు చాలా మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని, వారంతా పక్క రాష్ట్రంలోనే ఉంటారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. డాబాగార్డెన్స్‌లోని కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, బాబు వదిన, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరీ, తదితరులు చంద్రబాబు స్టార్ క్యాంపెయినర్లని చెప్పారు. ఎంత మంది కూటమిగా వచ్చినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని చెప్పారు. వైఎస్ జగన్ దళితుల పక్షపాతి అనడానికి నిదర్శనం.. విజయవాడ నడిబొడ్డులో కోట్ల విలువైన స్థలంలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రూ.400 కోట్లతో నిర్మించి జాతికి అంకితం చేయడమేనన్నారు. దేశంలోనే నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పి సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. మేధావి అంబేడ్కర్‌కు అరుదైన గౌరవాన్ని ఇవ్వాలని, ఆలోచించి దానిని ఆచరణలో పెట్టి ప్రపంచమంతా నివ్వెరపోయేలా వైఎస్ జగన్ చేసి చూపించారన్నారు. చంద్రబాబు తన పాలనలో పెత్తందారి వ్యవస్థకు, తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదల పక్షాన నిలబడి, వారి ఉన్నతికి దోహదపడ్డారన్నారు. ఈ సమావేశంలో కె.రాజారావు, అమల్‌దాస్ పాల్గొన్నారు.

'గైస్' విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక శాఖ నిర్వహించిన ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు రికార్డు సృష్టించారు. పాలిటెక్నిక్ డిప్లమా పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా 7వ సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. 2020-23 బ్యాచ్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 61 మంది పరీక్షలకు హాజరు కాగా.. 61 మంది ఉత్తీర్ణత సాధించారు. కాలేజీ స్థాపించిన తర్వాత ఇలా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం ఇదే మొదటిసారని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ చెప్పారు.

క్లుప్తంగా

నేడు చందన అలంకరణలో నృసింహ స్వామి దర్శనం

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి లక్ష్మీ నృసింహస్వామి గురువారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి కవచాలంకరణ, స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన చేయనున్నామని పేర్కొన్నారు. లక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సాయంత్రం దీపాలంకరణ సేవ జరిపించనున్నట్లు తెలియజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులతోనే కులగణన చేయించాలి

అనకాపల్లి : కులగణన ప్రభుత్వ ఉద్యోగులతోనే చేయించాలని ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు కలెక్టర్‌ను బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇంటింటికీ వలంటీర్లను ఏ అర్హతతో పంపిస్తున్నారో చెప్పాలన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లను ఇళ్లకు పంపబోమని చెప్పి, ఇప్పుడు పంపించడంలో అర్థమేమిటని ప్రశ్నించారు.

సీఐ శంకరరావుకు స్వాగతం



సీఐ శంకరరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పట్టణ సీఐ జి.శంకరరావును బుధవారం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కేఎం నాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న భాస్కరరావు

గొలుగొండ: చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మాతిరెడ్డి భాస్కరరావు రూ.30వేల విలువైన కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ హైస్కూల్ అభివృద్ధికి గతంలో కూడా ఆయన సహకరించినట్టు హెచ్‌ఎం రత్నాజీ తెలిపారు. స్థానికులు కూడా సహకారం అందించాలని కోరారు. భాస్కరరావును ఉపాధ్యాయులు అభినందించారు .

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,666 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,700
మొదటి రకం	3,580	4,100
రెండో రకం	3,520	3,760
మూడోరకం	3,310	3,510

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం : రాజా
గుంటూరు కారం : సత్యనారాయణ స్క్రీన్-1
హనుమాన్ : సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ : షిర్డీసాయి
సైంధవ్ : పర్తిసాయి
గుంటూరు కారం(రెండు షోలు)
హనుమాన్ : వెంకటేశ్వర
నా సామిరంగ : శ్రీసత్య
హనుమాన్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-47 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ నెగెటివ్-2 యూనిట్లు, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 482 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 423 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆసరా'గా నిలిచారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన రుణాలను మాఫీ చేశారు. దీంతో మహిళలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వం తమ పట్ల ఇంత ఉదారంగా ప్రవర్తించలేదని.. జగనన్న మాత్రమే చేదోడుగా నిలిచారని కొనియాడారు.



అచ్చెర్లలో మహిళల ఆనందం



తీడలో సంతోషం వ్యక్తం చేస్తూ..

- సీఎం జగన్‌కు రుణపడి ఉన్నామని స్వయం సహాయక సంఘ మహిళల వెల్లడి
- జగనన్న ఇచ్చిన ఆసరా సొమ్ము కుటుంబానికి దిక్కయిందని హర్షం

కశింకోట : మండలంలో వైఎస్సార్ ఆసరా కింద రూ.53 కోట్ల మేర రుణ మాఫీ జరిగింది. 1537 సంఘాలకు చెందిన 15,805 మందికి లబ్ధి చేకూరింది. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాలకు ఉన్న రుణాలను ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో మాఫీ చేశారు. ఇప్పటికే మూడు విడతలు స్వయం సహాయక సంఘాల మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయగా, తాజాగా చివరి విడతగా రూ.13.27 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఇవి వారి ఖాతాలకు జమ చేయడానికి ముఖ్యమంత్రి నగదు బదిలీని ప్రారంభించారు. దీంతో నిర్దేశించిన సంఘాలకు మొత్తం రుణ మాఫీ జరగడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ రుణ బాధ తీర్చి కుటుంబాలకు ఆసరా అందించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రుణ మాఫీపై సచివాలయాల వారీగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కలిగిస్తున్నారు. మంగళవారం ఆరు సచివాలయాలు, బుధవారం ఆరు సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపాలెం, కన్నూరుపాలెం, అచ్చెర్ల, తీడ, జమాదులపాలెం, జి. భీమవరం సచివాలయాల్లోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో నాలుగో విడత రుణ మాఫీపై అవగాహన కలిగించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి తమకు రుణ మాఫీ చేయలేదని, జగనన్న మాత్రమే ఆ పని చేసి తమను ఆదుకున్నారని మహిళలు ముక్తకంఠంతో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, లగిశెట్టి గణేష్, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, శంకరరావు, దుంగల అప్పలనాయుడు, గూడెపు లక్ష్మి, సర్పంచ్‌లు వెంకట్, కరక రాజ్యలక్ష్మి, చిరికి సత్యనారాయణ, ఎస్. శివ, నిమ్మదల సోమేష్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు సత్యారావు, రత్నం, చిన్నోడు, మేరీజోన్స్, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీలు నిర్మల, సత్యనారాయణ, రామకృష్ణ, వీవోఏలు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో ఆనందం వ్యక్తం చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

జగనన్నకు కృతజ్ఞతలు..



వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.24,500 రుణ మాఫీ జరిగినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నేను కుట్టు మిషన్ ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రుణమాఫీ కావడంతో కుట్టు పని పెట్టుబడికి మాఫీ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతోంది. శిక్షణ కూడా ఇస్తున్నారు. దీనివల్ల మా ఆదాయం మెరుగుపడి కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. రుణమాఫీ చేసి ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బత్తిన మణికంఠ, జి. భీమవరం

ఆసరా డబ్బుతో దుకాణం పెట్టుకున్నా..



వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో నాకు రూ.17,200 రుణ మాఫీ అయింది. గతంలో రుణ మాఫీ ఎవరూ చేయలేదు. చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాను. తగిన ఆదాయం లేక ఇతర పనులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు రుణ మాఫీ కావడంతో సీడ పట్టున దుకాణం నడుపుకుంటున్నాను. ఆదాయం మెరుగుపడి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

– కాలం రమణమ్మ, సింగవరం

రూ. 53 కోట్ల మేర రుణమాఫీ..



మండలంలోని 20 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ ఆసరా కింద 1537 స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ. 53 కోట్ల మేర పూర్తిగా రుణ మాఫీ జరిగింది. చివరి విడతగా రూ.13.27 కోట్లు అందించారు. దాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీంతో పూర్తి రుణ మాఫీ జరిగింది.

–ఎస్. శ్రీనివాసరావు, ఏపీఎం, వెలుగు, కశింకోట

'జగనన్న సురక్ష'తో ప్రజల చెంతకే వైద్యం



శిబిరంలో అందజేస్తున్న సేవలను పరిశీలిస్తున్న రమేష్

అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. 83వ వార్డు పరిధి 6వ సచివాలయంలో గల వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మలి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజల చెంతకే వైద్యం అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు సరైన వైద్యం అందిన దాఖలాలు లేవన్నారు. అంతకు ముందు ఆయన శిబిరంలో అందజేస్తున్న సేవలను పరిశీలించారు. శిబిరంలో కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూడా బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, యువజన అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, పార్టీ శ్రేణులు కారుకుండి నూకరాజు, బండి ఆనంద్, కటారి నూకరాజు, పి.కల్యాణ్, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రతిభ కనబరచాలి



పోటీలను ప్రారంభిస్తున్న సూరిబాబు

అనకాపల్లి : గ్రామ, మండల స్థాయిలో విజేతలైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక డీసీఎంఎస్ మైదానంలో ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమంలో కబడ్డీ, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను వెలికి తీసి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావడంతోపాటు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలన్నారు. అంతకు ముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, జెడ్పీ ఎస్.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



మహిళకు రిజిస్ట్రేషన్ పట్టా అందిస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లి: పేదల సొంతింటి కలను నిజం చేసి, వారి కళ్లల్లో ఆనందం నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. పట్టణంలోని 3,4 సచివాలయాల పరిధిలో సత్యనారాయణపురం టిడ్కో గృహ లబ్ధిదారులకు బుధవారం ఆమె రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు టిడ్కో గృహాలు అందిస్తామంటూ టీడీపీ నేతలు మభ్యపెట్టారన్నారు. 2019 ఎన్నికల సమయంలో విజయం సాధించేందుకు పేద ప్రజలకు టిడ్కో గృహాల నిర్మాణాన్ని హడావుడిగా ప్రారంభించి, అసంపూర్తిగా నిలిపివేశారన్నారు. మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి, ముఖం చాటేసిన చంద్రబాబుకు గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మంచి గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ఒకపక్క రాష్ట్రాభివృద్ధి, మరోపక్క పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లే ప్రయత్నాలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు. పేదల సంక్షేమాన్ని కాంక్షించే సీఎం జగన్‌ను పేదలందరూ ఆశీర్వదించాలని కోరారు. సత్యనారాయణపురం టిడ్కో గృహ సముదాయంలో రహదారులు, డ్రైనేజీ, వీధిదీపాలు, సురక్షిత మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లు త్రినాథ్, పార్టీ శ్రేణులు పలకా సత్యనారాయణ, చవితిన నూకరాజు, చింతా రంజీ, కోన ఉమ పాల్గొన్నారు.

వైభవంగా తీర్థమహోత్సవాలు



మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల పూజలు



పెదమదీనలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : మండలంలోని మేజర్ పంచాయతీ చౌడువాడలో శ్రీసీతారాముల, చంద్రయ్యపేటలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చంద్రయ్యపేట శివాలయంలో సర్పంచ్ సబ్బవరపు పార్వతి, ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు జరిపారు.

పెదమదీనలో ఘనంగా లక్ష్మీనరసమ్మ తీర్థం

బుచ్చెయ్యపేట: మండలంలోని పెదమదీన గ్రామంలో లక్ష్మీపేరంటాల తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొల్లిమల్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ తీర్థంలో నిర్వహించిన ముగ్గులు,ఉట్టుకొట్టు,కుర్చీ ఆట పోటీల్లో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కె.అచ్చింనాయుడు,సర్పంచ్ రమణ తదితరులు బహుమతులు అందజేశారు.

నేడు వరహాపురంలో...

చీడికాడ: మండలంలోని వరహాపురంలో సీతారాముల తీర్థమహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్లపరుగు పోటీలు జరపనున్నట్టు చెప్పారు.ఈ పోటీలు మధ్యాహ్నం ప్రారంభమవుతాయని, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన



వాహన చోదకులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లి : ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ శ్రీను అన్నారు. స్థానిక పూడిమడక జంక్షన్‌లో బుధవారం రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, అటువంటి వారిపై భారీ జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు. ట్రిపుల్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

- సూర్యనారాయణ కాలనీలో కాలువ పనులకు శ్రీకారం



కాలువ పనులు ప్రారంభిస్తున్న సూరిబాబు

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ సూర్యనారాయణ కాలనీలో దశాబ్దాల నాటి మురుగు సమస్య పరిష్కారం కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రజాపరిషత్ నిధుల నుంచి రూ.9 లక్షలతో ఎంపీపీ గొర్లి సూరిబాబు కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు కల్పించలేని స్థితిలో పాలన సాగించాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. సంవత్సరాలుగా ఉన్న సమస్యను పరిష్కరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కాలనీవాసుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు.

కాలువ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ-1 జోగా నాగమణి, ఎంపీటీసీ-2 కరిమజ్జి అలివేణి, ఉప సర్పంచ్ పి.భవానీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

గౌరమ్మ కల్యాణం.. ఊరంతా సంబరం



సారె ఊరేగింపులో ఓ భాగం



కల్యాణం జరిపిస్తున్న సంతోష్ అప్పారావు నాయుడు దంపతులు



సారె ఊరేగింపును ప్రారంభిస్తున్న సీఐ శంకరరావు

గౌరమ్మ పరిణయ వేళ అనకాపల్లి కల్యాణ శోభను సంతరించుకుంది. ఊరంతా పండగ వాతావరణం నెలకొంది. గవరపాలెంలోని గౌరీ పరమేశ్వరుల ఆలయంలో కల్యాణ మహోత్సవం అనంతరం అమ్మవారి సారె ఊరేగింపులో వేయిమందికి పైగా ముత్తయిదువలు పాల్గొనడంతో వీధులన్నీ కళకళలాడాయి. సారె పదార్థాల ఘుమఘుమలతో పరిసరాలన్నీ గుబాళించాయి. - అనకాపల్లి

నాడు-నేడు పనుల పరిశీలన



ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పరిశీలించారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని రాసిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. నాడు-నేడు నిధులతో ఆధునీకీకరించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ఆవరణలో ఉన్న స్టేజ్ ఎత్తును పెంచాలని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావుకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయా లతో చక్కగా చదువుకుని మంచి ఫలితాలు తీసుకువచ్చి, కళాశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

మహిళలకు మహోన్నత స్థానం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి

చోడవరం రూరల్: భారతీయ సమాజంలో మహిళలకు మహోన్నత స్థానం ఉందని, మహిళలు ఆత్మగౌరవంతో ముందడుగు వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నభారతి అన్నారు. కళాశాలలోని బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ మాట్లాడుతూ ప్రతి స్త్రీ తన కుటుంబంతోపాటు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ ఉపన్యాసకులు జి.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు కల్పించిన విశేష అధికారాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, కమిటీ సభ్యులు సీహెచ్.జ్యోతి, సరస్వతి, వి.అప్పలనాయుడు, కోమలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జి.వరలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యత గురించి తెలిపారు. వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు గుర్తించడం, వ్యక్తిగత రక్షణ చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ రత్నం మాట్లాడుతూ బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను స్థానిక కేజీబీవీలో ఎస్వో తులసి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎం. ప్రసాద్‌రావు నిర్వహించారు.

అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

నర్సీపట్నం:ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. నేషనల్ ఓటర్ల డేను పురస్కరించుకుని మండలంలో ధర్మసాగరం పంచాయతీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ మహిళలు వేసిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన అందరూ ఓటు హక్కును కలిగి ఉండాలని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ వెంకటలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కె.కోటపాడు : అసోసియేషన్ ఫర్ బ్రైట్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(ఏబీసీడీ) ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు సంస్థ కోశాధికారి లెక్కల అర్జున తెలిపారు. కె.కోటపాడు, బత్తివానిపాలెం, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న 30 మంది వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు.